

# రాధ పిన్ని డైటింగ్ కథ

సరస్వతుల విజయలక్ష్మి

రాధపిన్నిని చూసి చాలా రోజులైంది. ఒక్క మారువెళ్లి చూసి వద్దామనిపించింది. లేడికి లేచిందే పరుగు అన్నట్లు వెంటనే శ్రీవారికి ఫోన్ కొట్టి చెప్పేసి తాళాలు పక్కింటి ఆవిడకిచ్చి పిల్లలు స్కూలునుండి వస్తారు కాస్త చూడండి...సాయంత్రానికి వచ్చేస్తా'నని చెప్పి, బయల్దేరి, పిన్ని ఇల్లు చేరాను.

నాలుగుసార్లు కాలింగ్ బెల్ కొట్టాక కానీ తలుపుతీయలేదు పిన్ని.

ఆపసోపాలు పడుతూ కన్పించింది. జుట్టంతా రేగింది. చీర నలిగిపోయి వుంది. నన్ను చూసి ఆప్యాయంగా ''నువ్వా సంధ్యా రామ్మా రా..'' అంటూ లోపలికి తీసుకెళ్లింది.

''ఏం పిన్నీ వొంట్లో బాగోలేదా? చాలా నీరసంగా కన్పిస్తున్నావ్'' అని అడిగా సోఫాలో కూర్చుంటూ...

''ఏం చెప్పనమ్మా...కూర్చుంటే నీరసం, లేస్తే ఆయాసం...వున్న డిగ్రీలకి తోడు ఇంకో రెండు వచ్చి చేరాయి...''

''ఏంటి! అన్ని డిగ్రీలెప్పుడు చదివావ్?'' నవ్వుతూ అన్నాను.

''డిగ్రీలంటే బిపి, షుగర్ కూడా వచ్చాయి. మీపిన్ని శరీరం రోగాల నిలయం అయిపోయిందమ్మా.'' దిగులుగా అంది. కంఠంలో దుఃఖం తొంగిచూస్తోంది.

''షుగర్‌కి అంత భయపడక్కర్లేదులే పిన్నీ. ఇప్పుడది చాలా సామాన్యమైపోయింది. కొత్తకొత్త మందులు వచ్చాయి. టైమ్ ప్రకారం పత్యంగా తింటూ వాకింగ్, యోగా చేస్తే సరి.'' అన్నాను ధైర్యం చెపుతూ...

''అయ్యో నా మతి మండా.. వుండు కాఫీ తెస్తా..'' అంటూ కిచెన్‌లోకి వెళ్ళింది.

**సుగర్, ఒబెసిటి ఈ రెండూ ఇప్పుడు పెద్ద తలనొప్పిగా మారాయి. డైటింగ్ చేస్తున్నానని చెబుతూ ఇష్టమైన తిండిని లాగించే పిన్నిగారి గురించి, బరువు తగ్గించుకోవడానికి నానారకాల చిట్కాలను ఆశ్రయించిన ఒక కాంతం గురించి వరుసగా ఈ రెండు కథల్లో చదవండి.**

ఒక కప్పు కాఫీ నాకిచ్చి, ఒక చెంబులో నాలుగు మాత్రలు వేసుకొని గిరగిర కలిపి గటగటా తాగేసింది.

''ఏమిటి పిన్ని అది?'' అర్థంగాక అడిగా.

''కాఫీనే...మీలాగా కప్పులో తాగితే తాగినట్లు వుండదు. చెప్పొద్దూ...రెండు గ్లాసుల కాఫీ తాగితేనే తాగినట్లు వుంటుంది నాకు...'' నవ్వుతూ చెప్పింది.

''అయితే పత్యం చేస్తున్నావన్నమాట...''

''అవునే అమ్మా...పత్యం తిండి తినలేక చస్తున్నా... ఉప్పు వేసుకోకూడదు...తీపి తినకూడదూ అంటాడు డాక్టర్. నూనె, నెయ్యి వూసే ఎత్తొద్దంట... ఆవకాయకి ఆమడ దూరం వుండాలట....పచ్చళ్లు పట్టకూడదు. పులుసులు ముట్టకూడదు..అంటే ఎలా చెప్పు...తిండంటేనే విరక్తి పుట్టిపోయింది. ఆ తినేది కూడా ఒక్కసారిగా కాకుండా నాలుగు సార్లుగా తినమంటారు. నేనేమన్నా చిన్నపిల్లనా? ఇటునుండి వచ్చి అటునుండి వచ్చి తినడానికి? కావలసిందేదో ఒక్కసారిగా కడుపునిండా తింటే మళ్ళీ రాత్రి వరకూ తిండిపని వుండదు. నాకు చిన్నప్పట్నించి ఇన్నిమార్లు తినడం అలవాటు లేదు. అన్నప్రాసన నాడే ఆవకాయగిన్నె పట్టుకుని నాకేసానట. అలాంటిదాన్ని ఆవకాయ తినొద్దు అంటే ఎలా? వెన్నముద్దలు, గడ్డపెరుగులు తిని పెరిగినదాన్ని చమురు ముట్టుకోకూడదంటే ఎలా చెప్పు? ఇప్పుడు నన్ను సన్నపడాలంటే జరిగే పనేనా? వండిన నాలుగు గిన్నెలు ఒక చోట పెట్టి గాలి పీల్చితే వొళ్లొస్తోంది... ఏం చేయాలి తల్లీ...

పంచదార లేని కాఫీ తాగాలంటే అమ్మపోయినప్పుడు వచ్చినంత ఏడుపొస్తోంది... మొన్నటివరకూ ఉదయం చెంబుడు కాఫీ తాగితే మళ్లా మధ్యానం వరకు పనే. దంపుళ్ళూ, విసురుళ్ళూ, నీళ్ళు తోడ్డం, బట్టలుతకటం. వంచిన నడ్డి ఎత్తకుండా పని చేసేదాన్ని. మధ్యాన్నం అరకిలో బియ్యంపుటన్నంలో ముద్దపప్పులో పురిసెడు నెయ్యి వేసుకొని పట్టెడు ఎర్ర ఆవకాయ వేసుకొని తినేదాన్ని. గడ్డపెరుగు వేసుకుతింటే మళ్లీ రాత్రి ఇంట్లో మొగాళ్ళు పిల్లలు తిన్నాకే తినడం. ఒక్కనాడుకూడా జిర్రున చీదలేదు. ఒక డాక్టర్ని చూడలేదు. ఒక్కమందుబిళ్ళ వేసుకోలేదు. ఏమిటో ఈ మాయదారి రోగం పట్టుకుని అన్నింటినీ మార్చేసింది. జీవితం ఎలా వెళుతుందో? ఏమో?'' అంది పిన్ని ఎంతో విచారంగా.

''ఏం భయంలేదు పిన్నీ... ఇప్పుడు పదిమందిలో తొమ్మిదిమందికి షుగర్ వుంది. అందరూ మందులు తీసుకుంటూ జాగ్రత్తగా వుండటం లేదూ.. అలాగే నువ్వూనూ..'' అంటూ ధైర్యం చెప్పింది.

భయపడి మాత్రం చేసేది ఏముందిలేమ్మా..పద భోజనం చేద్దాం...''

డైనింగ్ టేబుల్ మీద తళతళలాడ్తూ నాలుగు స్టీలు బౌల్సు, రెండు ప్లేట్లు కన్పించాయి. కొత్తవి కొన్నట్టుంది.

''పిన్నీ నీకింకా ఈ స్టీలు సామాను పిచ్చి పోలేదా! '' అంటూ గిన్నెలమీద మూతలు తీసి చూసాను.

ఒక గిన్నెనిండా పాలకూర పప్పు, నెయ్యి పోపు వేసి ఘుమఘుమలాడుతోంది. మరో గిన్నెలో కాకరకాయ పులుసు బెల్లంకూర.. ఎర్రగా మర్రిపళ్లలా వేయించినట్టుగా వుంది. మరో గిన్నెలో పెరుగు. చాకుతో కోసినా తెగనంత గట్టిగా వుంది. పెద్ద డిష్‌లో తెల్లటి మల్లెమొగ్గలాంటి అన్నం, గుండ్రటి డిష్‌లో నేతితో వేయించి తీసిన చపాతీలు...కమ్మటి వాసనతో చూడంగానే నోరూరిస్తూ కన్పిస్తున్నాయి. అన్నీ చూసాక మళ్లీ ఏమీ ఎరగనిదానిలా అన్నిటిమీద మూతలు పెట్టి కూర్చున్నాను.

''ఏమిటి పిన్నీ... అన్ని కొత్త గిన్నెలు కొన్నావ్... దేనికి?''

''ఏం చెప్పమంటావే తల్లీ.. అదో కథ. ఈమధ్య వంట్లో బాగోలేదని డాక్టర్ దగ్గరికి వెళితే షుగర్ పెరిగిందని బౌల్ కొలతగా తినమని చెప్పారు డాక్టర్లు. వైద్యోనారాయణో హరీ అన్నారుకదా మరి.. ఆ వైద్యో హరి మాట వినకపోతే నేను హరీ అంటానేమో అనీ.. వెంటనే బౌలులు కొని తెచ్చి ఆ లెక్కప్రకారం తింటున్నానే తల్లీ...''

''ఏం చెప్పమంటావే తల్లీ.. అదో కథ. ఈమధ్య వంట్లో బాగోలేదని డాక్టర్ దగ్గరికి వెళితే షుగర్ పెరిగిందని బౌల్ కొలతగా తినమని చెప్పారు డాక్టర్లు. వైద్యోనారాయణో హరీ అన్నారుకదా మరి.. ఆ వైద్యో హరి మాట వినకపోతే నేను హరీ అంటానేమో అనీ..వెంటనే బౌలులు కొని తెచ్చి ఆ లెక్కప్రకారం తింటున్నానే తల్లీ...''

''అవునా? అదేమిటి పిన్నీ... మరి ఆ గదిలో అన్ని పళ్ళు? ఇంట్లో పూజలేమైనా వున్నాయా?''

''అవునే తల్లీ...పొట్టపూజకే. ఆకలేసినప్పుడల్లా ఫ్రూట్‌సలాడ్ తినమని చెప్పారే డాక్టర్లు...గడిగడికి వెళ్లి ఎవరు కొంటారని ఒకే మాటు నాలుగేసి పళ్లు ప్లేటు నిండా పెట్టుకుని తింటాను'' అని చెప్పింది.

''సర్లే. నా కష్టాలెప్పుడూ వుండేవేలే తల్లీ...రా..టిఫెన్ చేద్దువుగానీ'' అని పిలిచింది.

ప్లేటులో ఎర్రగా కాలిన మినపరొట్టె, పట్టెడు కొబ్బరిపచ్చడి..నూనె కారుతూ ఆవకాయ వేసి తెచ్చిచ్చింది. దానికి తోడు పప్పు, కూర కూడా వేసింది. నంజుకోడానికి.

నిజంగా పిన్ని చేతివంట అమృతమే.

ఒకసారి మా తాతగారు పనిమీద పిన్నివాళ్ల ఊరు వెళ్లి వాళ్లమ్మగారింటికెళ్లారుట. ఆవిడకు ఏదో ఆటంకం వస్తే.. పిన్ని వండిపెట్టిందట. ఆ వంటతిని ఇంత బాగా వంట చేసిందెవరని అడిగేడట..మా తాతగారు. ''మా చిన్నమ్మాయి చేసింది'' అన్నారట వాళ్లనాన్నగారు.

ఆయన ఆ మాటలకు ఆశ్చర్యపోయి...''అయితే మీ చిన్నమ్మాయిని మా కోడలిగా చేసుకుంటాం'' అని అడిగారట. అంటమే కాదు మళ్లీ వారం తిరగకముందే వెళ్ళితాంబూలాలు కూడా పుచ్చుకున్నారట.

పెళ్లయింది మొదలు ఆయన పోయేదాకా పిన్ని చేతి వంటే తినేవారట. యింటికి ఎవరొచ్చినా ''తింటే మా కోడలి చేతివంటే తినాలి'' అంటూ కోడల్ని పొగుడుకునేవారట.

అది విని పొంగిపోయి మరిన్ని కొత్త కొత్త వంటలు నేర్చుకుని మరీ శ్రద్ధగా చేయడం మొదలు పెట్టింది. ఇప్పుడు పిన్ని అన్నిరాష్ట్రాల వంటలూ చకచకా చేస్తుంది.

పిన్ని చేతి టిఫిన్ పుష్టిగా తిని, త్రేన్చుకుంటూ వక్కపొడి వేసుకున్నా.

పిన్ని, నేను మళ్లీ కబుర్లలో పడ్డాం.

''రాధమ్మా భోజనాలయ్యాయా?'' అంటూ ఎదురింటి సులోచనమ్మ, లక్ష్మి ఆంటీలు వచ్చారు,

''రండి. రండి.'' అంటూ ఆహ్వానించి...'' మీ భోజనాలు అయ్యాయా?'' అని మర్యాదగా తనూ అడిగింది వాళ్లని.

''నిన్న ఉపవాసం కదమ్మా.. తెల్లారి తొందరగా వండి వాళ్లకింత పెట్టి పంపించి నేనుకూడా ఆ చేత్తోనే గుప్పెడు మెతుకులు తిన్నాను. లేచింది మొదలు కాళ్లు లొటలొట..గుండె దడదడ...ప్రాణం త్రాహి త్రాహి అంటోందనుకో..'' అంది ఒకావిడ.

నేను విని వూరుకోకుండా.. ''మరి మీకు సుగర్ వుందికదా... ఉపవాసాలు వుండొచ్చా?'' అని అడిగాను.

''చాలుచాల్లేమ్మా అందరూ అలాగే అంటారు. నేను ఎలాంటి వంశంలో పుట్టేనూ? యజ్ఞాలు యాగాలు చేసే వంశం మాది... ఉప్పునిప్పు కడిగే ఆచారం మా పుట్టింట్లో. అలాంటి ఇంట పుట్టి పూజా పునస్కారం మానేయకుండా ఉపవాసాలు వుండకూడదంటే ఎలా? చస్తే చస్తానుగాని అలాంటి అనాచారం పన్లు చేయను సుమా!

''ఎన్ని ఉపవాసాలు చేస్తారు? చూడమ్మా నాగుల చవితికి వుండకపోతే నాగమయ్యకి కోపం..సుబ్రహ్మణ్యషష్టికి వుండకపోతే ఆయనకి కోపం, శివరాత్రికి వుండకపోతే శివయ్యకి కోపం. భీష్మ ఏకాదశికి వుండకపోతే భీష్ముల వారికి కోపం. వైకుంఠ ఏకాదశికి వుండకపోతే నాకోసం వైకుంఠద్వారాలు తెరుచుకోవు కదా?''

''అంతేనా... ఇంకా వున్నాయా?''

''ఇంకా విను మరి. ఇక వొంటిపొద్దులు ఎప్పుడూ వుండనే వుంటాయి. ఏడు రోజులూ ఏడు దేవుళ్లకి ఉపవాసాలుండాల్సిందే.''

''ఇంతకీ మీకున్న సుగర్ ఏ స్థాయిలో వుంది?''

''ఆ మహాఅయితే ఏ మూడొందలో, మూడొందల యాభయ్యో వుంటుంది.''




''అమ్మో..అంతే!? ప్రమాదం సుమండీ...మరి మందులు వాడుతున్నారా?''

''వాళ్లు ఇంజక్షన్స్ తీసుకోవాలనే అంటారు కానీ.. వాళ్ల ఆటలు నేనాడనిస్తానా ఏమిటి? వద్దు. పొమ్మన్నాను. మందులే వేసుకుంటాను. పొద్దున్నే గ్లాసుడు కాకరకాయరసం తాగుతా. గుప్పెడు మెంతులు నోట్లో వేసుకుంటా. గ్లాసుడు నీళ్ల గడగడ తాగుతా. వేపాకులు నములుతా. ఇంత చేసినా తగ్గకపోతే ఇక దాని ఖర్మ...'' అన్నారు.

''అయినా నాకు తెలీక అడుగుతా...అన్నిపత్యాలు చేసి కాకిలా కలకాలం బ్రతికేకంటే...హంసలా ఆర్నెల్లు బ్రతికినా చాలు'' అన్నారు పిన్ని.

''లక్ష్మీ అంటీ మరి మీకుందా సుగర్?'' అని అడిగాను.

''ఏమమ్మాయ్... వాళ్లు ఎక్కువేమిటి నేను తక్కువేమిటి? వాళ్లిద్దరికీ వుండి నాకు లేకపోతే ఎంత నామోషీనే తల్లీ...అందుకే వాళ్లతో సమానంగానే వున్నాను.'' అన్నారు నవ్వుతూ. అదేదో సిరి అన్నట్టు.

ఆ మాటలకు అందరూ గొల్లున నవ్వారు.

''అయితే మరి పత్యం చేయరా?'' అడిగాను.

''కొడుకుల పంచన చేరాం. మాకు వేరే పత్యం ఎందుకమ్మా? షుగర్ పెరిగితే 'దొంగతిళ్లు ఏం తిన్నారు ' అని ముఖానే అడుగుతుంది మా కోడలు. అందుకని ఒకరోజు ఎక్కువ తిందామన్నా కుదరదు.''

''ఏమో మీరు కాబట్టి వున్నారు కానీ, ఆ కొలత భోజనం నావల్ల కాదు'' ఖచ్చితంగా అనేశారు సుగుణమ్మగారు.

''అవునవును..'' అంటూ పిన్నికూడా గొంతు కలిపింది. ''షుగర్ తగ్గితే పంచదార నీళ్ళు, కప్పుడు అన్నం తినమన్నాడు కదా డాక్టరు... అని నాలుగు అంటే నాలుగు మెతుకులతో పరమాన్నం చేసుకుని తిన్నానా... దీని దుంప తెగ షుగరు రాకెట్‌లా పెరిగిపోయిందనుకో...మాయదారి జబ్బుని..

పూర్వం కార్తీక పౌర్ణమి ఉపవాసాలుంటే సాయంకాలాలు కొబ్బరికాయంత చలిమిడి, అరడజను అరటిపండ్లు, నాలుగు కమలాపండ్లు తినేదాన్ని..నేనూ బాబాయిగారూ బయటికి అలా మార్కెటుకుగాని, గుడికిగాని వెళ్తే దారిలో ఐస్‌క్రీమ్ కొనుక్కునేదాన్ని. శుభ్రంగా తినేదాన్ని. అట్లాంటిది..నోరుకుట్టేసుకున్నట్టు వుండమంటే నావల్ల కాదు బాబూ...'' అంటూ రాగం తీసింది పిన్నిగారు.

''పోనీ పిన్నీ!..కాస్తంత వాకింగ్, యోగా చేస్తుండొచ్చు కదా..''

ముగ్గురు నా మాటలకు పకపకా నవ్వారు. ''అన్ని వేలు ఖర్చు పెట్టి మేమెక్కడ వేగుతాం..''

''అదేమిటి? వేలెందుకవుతాయి?'' అన్నాను అర్థంగాక.

''అదికాదే సంధ్యా. ఆమధ్య ఓసారిలాగే వాకింగ్ కని బయల్దేరి వెళ్లా. డాక్టరు రోజుకి నాలుగయిదు కిలోమీటర్లు నడవాలని చెప్తే... ఆపసోపాలు పడ్తూ, దొర్లుకుంటూ, వెళ్లాను. తీరా అక్కడికి వెళ్లి చూస్తే ఊపిరి అందలేదు. నోరు పిడచకట్టుకుపోయి ఇక అక్కడే ప్రాణంపోతుందేమోననేంత భయం వేసింది. కాలుకదపలేకపోయాను. చుట్టూ చూస్తే ఒక్క వాహనం కూడా కన్పించలేదు. చివరికి ఒక ఆటో ఎక్కి ఇల్లుచేరి బ్రతికి బయటపడ్డాను. మొదటిరోజు అలాగే వుంటుందని మళ్లీ రెండో రోజు వెళ్లి ప్రయత్నించా. మళ్లీ ఆటో ఎక్కి రావాల్సివచ్చింది. చివరికి మా ఆయన 'రాధా నువ్వు వాకింగ్ చేస్తే నాజీతం అంతా అయిపోతుంది..అంతంత దూరాలు వెళ్లకు. ఇంట్లో ఇంట్లో వాకింగ్ చేసుకో చాలు' అని అన్నారు.

పోనీ కదా అని యోగా చేస్తే పిల్లలు వచ్చి శిర్షాసనం మంచిదంటూ తల్లక్రిందులుగా నిలబెట్టేసారు. 'చచ్చేను బాబోయ్' అని గావుకేక వేసాను. వాళ్లు భయపడిపోయి దించేసారు. మెడంతా వాచిపోయి ఒకటే నొప్పి. ప్రాణం పోయినట్టయింది. డాక్టర్‌కి చెబ్తే ముక్కచివాట్లేసాడు. బరువున్నవాళ్లు అలా తల క్రిందుల ఆసనాలు వేయకూడదని. అదృష్టం బాగుండి మెడనరాలు విరిగిపోలేదు. ఎక్స్‌రేలకు పరీక్షలకి అన్నీ కలిపి నాలుగు వేలు అయ్యాయి. అందుకే వాకింగ్, యోగాలు చాలా ఖరీదైనవి అని మా అందరి అభిప్రాయం..'' అంటూ ముగించింది పిన్ని.

''అయ్యో ఇంత జరిగినా నాకు చెప్పలేదేమిటి పిన్నీ..'' అన్నాను నొచ్చుకుంటూ. మళ్లీ అందర్నీ ఉద్దేశించి ''మీకంటే చిన్నదాన్ని అయినా ఒక మాట చెప్తాను వింటారా?''

''అయ్యో చెప్పు తల్లీ. తప్పకుండా వింటాం. చెప్పమ్మా. వేమనగారు ఏమన్నారో తెలుసా? వినదగునెవ్వరు చెప్పినా వినాలి అని...'' అన్నారు పిన్ని.

''షుగరు వ్యాధి చాలా చెడ్డది. పీకలమీదికి తెస్తుంది. హార్టునో, కిడ్నీనో, కంటినో దెబ్బతీస్తుంది. పక్షవాతానికి దారితీస్తుంది. శరీరావయవాల్లో ఏ భాగం దెబ్బతిన్నా తిరిగి పూడ్చుకోలేనిది. లక్షలు ఖర్చవ్వకా తప్పదు. అంతేకాదు, చిన్నదెబ్బతగిలినా కోతిపుండు బ్రహ్మరాక్షసి అన్నట్లు అవుతుంది. మనమా సామాన్యులం. డబ్బు ఖర్చుపెట్టి ఆరోగ్యాన్ని కొనుక్కోలేం. కొంటానికి సయితం దొరకని అనారోగ్యాలు వస్తాయి దీనివల్ల. జీవితమంతా మంచంలో పడి నరకం అనుభవించాల్సివస్తుంది. మీకంటే కోడళ్లున్నారు...కొలత భోజనం పెట్టడానికి. కాని మా పిన్ని సంగతి అలా కాదు. పిల్లల చదువులున్నాయి. యింటిపనులు వేళకు జరిగిపోవాలి. బాబాయి ఆఫీసుటైంకి వంట అందించాలి. యిల్లు చూసుకోవాలి. పిల్లల భవిష్యత్తుని తీర్చిదిద్దాలి. ఆడపిల్లల పెళ్లిళ్లు చేయాలి. ఈ బాధ్యతలన్నీ తీర్చడానికి ఆవిడకు ఆరోగ్యం వుండాలి. జబ్బు అత్తగారంటే-పిల్లలకి వచ్చే సంబంధాలన్నీ వెనక్కి వెళ్లిపోతాయి. ఇంట్లో ఆడది మూలపడితే ఇల్లంతా చీకటయిపోతుంది. ఇక మిగిలేది దుఃఖమే.'' అంటూ ముగించాను.

ముగ్గురూ నోరెళ్లబెట్టి చూసారు నావంక.

''హమ్మో. అన్ని నష్టాలున్నాయా...మాకు తెలియదు సుమా. ఎవరూ చెప్పలేదు కూడా. అమ్మా సంధ్యా...అరటిపండు వొలిచి చేతిలో పెట్టినట్లు ఎంత బాగా చెప్పేవూ? నువ్వుచెప్పినట్లే చేస్తాం.

ఏం తినమంటే అదే తింటాం. ఇకనుంచి హంసల్లాగే బ్రతుకుతాం. మేంముగ్గురం రేపట్నుంచి వాకింగ్‌కూడా వెళ్తాం. ఈసారి నువ్వొచ్చేసరికి చూడు...మాలో ఎంత మార్పువచ్చిందో నువ్వే చెప్తావు..'' అన్నారు వాగ్దానం చేస్తున్నట్టు.

ఇంతలో- బాబాయి తప్పట్లు కొడ్తూ లోపలకు వచ్చారు. '' ఏమ్మా సంధ్యా. పిన్నికీ ఆంటీలకీ అందరికీ బాగా బ్రెయిన్ వాష్ చేసావు. గుడ్. మేం చేయలేని పని నువ్వు చేసావమ్మా..థాంక్స్'' అన్నారు మెచ్చుకోలుగా.

వంటలో నూనె డబ్బాలు దిమ్మరించకుండా నీళ్లతో వుడికించుకుని చేసే వంటలు కొన్ని చెప్పాను-పిన్నికి. కడుపు మాడ్చుకోకుండా- ఆవిరిమీద ఉడికే టిఫిన్లు, నూనెలేకుండా కాల్చుకునే మెత్తటి చపాతీల తయారీలు కొన్ని సూచించాను. ఆకలేసినప్పుడల్లా.. ఫ్రూట్ సలాడ్ పేరుతో డజన్లకొద్దీ పళ్లు తినకుండా...పచ్చికూరగాయల ముక్కలు ఎలా తినాలో నేర్పాను.

''సంధ్యా ఇవన్నీ నీకెలా తెలుసే'' అంటూ గడ్డం మీద చెయ్యేసుకుంది పిన్ని.

అనారోగ్యం బారిన పడకుండా వాళ్లకి తగిన సాయం చేసానన్న తృప్తితో ఇంటిముఖంపట్టాను.

మరుసటిరోజు రాధపిన్ని ఇంటికెళ్ళేసరికి మళ్ళీ అవే డిష్‌లు, నేతిలో వేయించిన చపాతీలు, గడ్డపెరుగు కనిపించాయి. నన్ను చూడగానే జడుసుకుని వాటిని దాచేసింది.

★